



ఆ రోజు లంచాలు దొరకలేదని క్రింది వుద్యోగుల మీద మండి పడుతున్న గవర్నమెంట్ ఆఫీసర్ లా మండి పడుతున్నాడు సూర్యుడు.

అంత ఎండలోనూ 'దేవుడా! ఎన్ని తిప్పలు తెచ్చి పెట్టావురా!' అనుకుంటూ బయల్దేరాడు నారాయణ. బయల్దేరకేం చేస్తాడు? అతనికి పిల్లనిచ్చిన మామ, పిల్లని

తీసుకెళ్ళి కాపురం పెట్టమని వృత్తరాల మీద వృత్తరాలు దంచుతున్నాడు. రేపో మాపో కూతుర్ని వెంటబెట్టుకుని సరాసరి వచ్చేసి నెత్తిన కూర్చుంటాడేమో నని గుండె దడగా వుంది.

భయం ఎందుకంటే అతనికి క్వార్టర్ లేదు. స్నేహితుడు మునుస్వామి కిచ్చిన క్వార్టర్‌లోనే నలుగురితోపాటు సర్దుకుంటున్నాడు. అది ప్రాజెక్టు ప్రాంతం కాబట్టి గవర్నమెంటు వారి క్వార్టర్స్ తప్ప వేరే ఇళ్ళు వుండవు. ఆర్నెల్ల క్రితం అతను డ్యూటీలో జేరిన మర్నాడే క్వార్టర్ యిప్పించమని అప్లికేషన్ పెట్టాడు. ఆర్నెల్లు దాటిపోయినా క్వార్టర్ యిచ్చినట్లు ఆర్డరైతే రాలేదు.

"నువ్విక్కడ జపం చేస్తూ కూర్చుంటే క్వార్టర్ నీ దగ్గరికి రాదు. నువ్వే దానికోసం వెళ్ళాలి. బిల్డింగ్స్ డివిజన్‌కి వెళ్ళి గుమాస్తాను కలుసుకో" అని ఒక స్నేహితుడు సలహా చెప్పాడు.

అందుకే అంత ఎండనీ వెన్నెలగా భావించి బయల్దేరాడు నారాయణ. వెళ్ళడమైతే వెళ్ళాడుగాని ఆ ఆఫీసులో హడావుడీ, జనంలో సీరియస్‌నెస్ చూసి కాళ్ళాడ లేదు. తనకు క్వార్టర్ యిచ్చే మహానుభావుడెవరో అతనికి అర్థం కాలేదు. ఎంతసేపు నిల్చున్నా నారాయణ ముఖం ఎవరూ చూళ్ళేదు. చూశారేమోగాని ఎవ్వరూ పలకరించలేదు. అతను పలకరించబోయినా పలికితే ఎక్కడ తమ నోటి ముత్యాలు రాలి పోతాయో నని భయంతో కాబోలు ముఖాలు ప్రక్కకు తిప్పుకుంటున్నారు.

"ఎలాట్‌మెంట్ సెక్షన్‌లో పని చేసే అటెండర్ని పట్టుకుంటే పని జరిగిపోతుంద"ని ఎవరో చెప్పిన మాట మంత్రంలా అతనికి సమయానికి జ్ఞాపకం వచ్చింది.

"హమ్మయ్య!" అని నిట్టూర్చాడు. ఎలాట్‌మెంట్ సెక్షన్ అటెండర్ ఎవరో? ఎవర్నయినా అటెండర్ని అడుగుదామని చూశాడు. కాని అక్కడ అటెండర్లు బీదలకు అన్నదానం చేస్తున్న వాళ్ళలా చాలా ఠీవిగా, ఎంతో చిరాగ్గా అద్భుత రసం పోషిస్తున్న నటుల్లా వింతగా, హడావుడిగా తిరుగుతున్నారు. అందులో ఒకర్ని పట్టుకుని ఎలాట్‌మెంట్ సెక్షన్ అటెండర్ ఎవరో చెప్పమని ప్రతిమాలాడు నారాయణ. అతను ఎగాదిగా చూసి మూలనున్న మనిషిని చూపించాడు.

ఆ అటెండర్‌గారు వరండాలో

కూర్చుని చుట్ట నోట్లో పెట్టుకుని కళ్ళు మూసుకుని ప్రశాంతంగా, వేదాంతికి మల్లే పరిసరాలను లక్ష్యం చెయ్యకుండా తన్మయా వస్థలో వున్నాడు.

"అన్నా!"

తపోభంగమైన మునిలా కళ్ళు తెరిచి చూపి, "ఎవరూ?" అన్నాడు.

"నా పేరు నారాయణన్నా! ఆర్నెల్లయింది వాచ్‌మాన్ నౌక రీలో చేరి. కొత్తగా పెళ్ళి చేసు కున్నా. క్వార్టర్ కావాలన్నా."

"గుమాస్తాగారిని కలుసు కున్నావా?"

"లేదన్నా!"

"ముందా బాబుని కలుసుకో. శానా మంచోడు. నీ పని అవుద్ది."

"ఎవరన్నా ఆయన! కాస్త చూపించి పుణ్యం గట్టుకో."

అటెండర్ ఎంతో కష్టంమీద లేచి వచ్చి దూరంగా నిల్చుని గుమాస్తాగారి సీటు చూపించాడు. కాని ఆయనగారి చుట్టూ ఎవరో నలుగురు నిల్చుని కబుర్లాడుతూ వుంటే దూరంగానే నిల్చున్నాడు నారాయణ. వాళ్ళు ఎంతకీ కద లడం లేదు. తలా తోకా లేని కబుర్లు దొర్లిస్తూ నవ్వుకుంటూ కాలం గడుపుతున్నారు. ఆయన్ని ఒంటరిగా ఉన్నప్పుడు కలుసుకుని తన గోడు వెళ్ళబోసుకోవాలని ఆశపడుతున్న నారాయణకి నీరసం ముంచుకొచ్చింది. కాలం కరిగి పోతూంటే నారాయణకి ఆకలితో కడుపు మాడిపోతూ వుంది. కాసే పటికి ఆ నలుగురితో పాటు లేచి కాంటీన్‌వైపు దారితీశాడు గుమాస్తా గారు.

అప్పుడు చూశాడు నారాయణ గుమాస్తాగారి ముఖం.

అతను ఎవరో కాదు—సత్య మూర్తి.

సత్యమూర్తి ఎవరంటే అదో కథ.

అప్పుడు నారాయణ రిక్షా తొక్కుతూ వుండేవాడు. గుంటూరు దరిదాపుల్లో వున్న పల్లెలనుంచి టౌన్‌కి రిక్షా కదుతూ పొట్ట పోసు కునే రోజులు.

ఆ రోజు నారాయణకి బాడుగ దొరక్క ఖాళీబండి తొక్కుకుంటూ టౌన్ వైపు వస్తున్నాడు.

రోడ్డంతా నిర్మానుష్యంగా చీకటిగా వుంది.

సైకిల్‌మీద వస్తున్న ఒక వ్యక్తి ఎదురుగా వస్తున్న లారీ హెడ్ లైట్ల కాంతికి కళ్ళు చెదిరి కంగారు పడి కెవ్వున కేకవేసి పడిపోయాడు. లారీ రివ్వున దూసుకుపోయింది. నారాయణ రిక్షా ఆపి చూశాడు.

అదృష్టవశాత్తు లారీవల్ల ఏ ప్రమాదమూ జరగలేదు. క్రింద పడడం వల్ల తల రాయికి తగిలి గాయమైంది. రక్తంతో అతని బట్టలు ఎర్రబడ్డాయి. బాధతో మూలుగుతూ వుంటే నారాయణకి ఎంతో జాలి వేసింది. అతన్నా పరిస్థితిలో వదిలి వెళ్ళడానికి మనసొప్పలేదు.

రిక్షాలో పడుకోబెట్టి గుంటూరు తీసుకెళ్ళి హాస్పటల్లో జేర్పించాడు.

అతనే సత్యమూర్తి.

సత్యమూర్తి కోలుకున్నాక తనను రక్షించింది నారాయణని తెలుసుకుని ఎంతో కృతజ్ఞత చూపించాడు. తన పాలిట దేవుడివని పొగిడాడు. అతనే ఆ సమయంలో రక్షించక పోతే తను చచ్చిపోయి వుండే వాడినని కూడా అన్నాడు.

అదంతా జ్ఞాపకం వచ్చి పులకించి పోయాడు నారాయణ. సత్యమూర్తి బాబు గుంటూరు నుంచి ఇక్కడికి ఎప్పుడు వచ్చాడో? తనకి క్వార్టర్ యిప్పించేది ఆ బాబే! ఇకనేం! తన రొట్టె విరిగి నేతిలో పడ్డట్టే—అనుకుంటూ అప్పుడే తనకి క్వార్టర్ యిచ్చినట్లూ, భార్యని తీసుకొచ్చి కాపురం పెట్టినట్లూ కలలు కనసాగాడు.

క్యాంటీన్‌కి వెళ్ళిన సత్యమూర్తి అరగంట తర్వాత వచ్చి సీట్లో కూర్చున్నాడు. సిగిరెట్ వెలిగించి గుప్పు గుప్పున పొగ వదుల్తూ ఏదో ఆలోచిస్తున్నాడు. ఒంటరిగా వున్నాడు గదా ఇక అతని ఎదుట పడి తన గోడు చెప్పుకుందామని అనుకుంటూ వుండగా అటెండర్ వచ్చి ఆఫీసర్ గారు పిలుస్తున్నారని సందేశం తెచ్చాడు.

సత్యమూర్తి లేచి ఆఫీసర్‌గారి రూమ్‌లోకి వెళ్ళాడు. పావు గంట తర్వాత తిరిగి వచ్చి సీట్లో కూర్చున్నాడు. వెళ్ళేటప్పుడూ, వచ్చేటప్పుడూ కూడా వరండాలో నిల్చున్న నారాయణని అతను గమనించలేదు.

తర్వాత సత్యమూర్తి చాలా చిరాగ్గా వున్నాడు. అతని మాటలు వరండాలోకి వినిపిస్తున్నాయి.

"మాతో గాడిద చాకిరీ చేయించుకోడానికి అందరూ మొనగాళ్ళే. మా కివ్వవలసిన ప్రమోషన్లు గురించి ఎవ్వరూ పట్టించుకోరు. పని....పని అని గొంతు మీద కూర్చుంటారు." బీరువాలో పాత ఫైళ్ళు వెతుక్కుంటూ తన అక్కసు వెళ్ళబోసుకుంటున్నాడు.

ఆ విధంగా ఆ పూట గడిచిపోయింది. ఇంతలో గోడ గడి

యారం ఒక గంట కొట్టింది. లంచ్ టైమయిందని అంతా లేచి వెళ్ళిపోయారు.

సత్యమూర్తి సీట్లోనే కూర్చుని వుండడం చూసి ఏ మాత్రం ఆలస్యం చెయ్యకుండా ఎదుట పడి నమస్కారం చేశాడు నారాయణ.

అతన్ని చూసి ఆశ్చర్యపోతూ- "నువ్వు నారాయణవి గదూ?" అన్నాడు.

"అవును సార్!"

"గుంటూర్లో వుండేవాడివి. ఈ అడవిలోకి ఎప్పుడొచ్చావ్?"

"ఆర్నెల్లయింది వచ్చి. పిమెంట్ సబ్ డివిజన్‌లో వాచ్ మాన్‌గా పని చేస్తున్నా సార్!"

"అలాగా" అన్నాడు సత్యమూర్తి యధాలాపంగా.

"నాకు క్వార్టర్ కావాలి సార్! కాపురం పెట్టమని మా మావ గొడవ పెడుతున్నాడు సార్!" నారాయణ సిగ్గుపడుతూ అన్నాడు.

క్వార్టర్ పేరెత్తగానే గుమాస్తాగారు ముఖం మీద సీరియస్‌నెస్ పులుముకున్నాడు. మరుక్షణం కణతలు నొక్కుకుంటూ ధ్యానముద్ర వేశాడు.

"క్వార్టర్ కావాలా? అబ్బ! చాలా టైట్‌గా వుందోయ్ పొజిషన్. సర్లే ఎక్కడైనా ఖాళీ లున్నాయేమో చూసి ఎలాట్‌మెంట్ వేస్తా. ఒక వారం ఆగి కనపడు" అన్నాడు.

నమస్కారం చేసి బైట పడ్డాడు నారాయణ. సత్యమూర్తి బాబుండబట్టి ఒక వారంలో క్వార్టర్ రావడం ఖాయమని ధైర్యం కలిగింది.

వారం తర్వాత వెళ్ళాడు. క్వార్టర్ లేకపోవడం వల్ల తమ కాపురం పెట్టడానికి వీల్లేకపోయిందనీ, కాని తన మామ విస్తారంగా వుత్తరాలు వ్రాస్తున్నాడనీ చెప్పుకుంటున్న నారాయణ వైపు చిద్విలాసంగా చూసి, ప్రజల కష్టాలు వింటున్న మంత్రిగారిలా 'మా మూలే' అన్నట్లు చిరునవ్వుచిందించి, "తొందర పడకోయ్! క్వార్టర్లు ఖాళీ అవడం లేదు. వుంటే యిస్తానూ? అప్పుడప్పుడు కలుస్తూ వుండు" అన్నాడు సత్యమూర్తి.

అప్పుడప్పుడు కలుస్తూ ఆర్నెల్లు తిరిగాడు నారాయణ. తిరిగి తిరిగి కాళ్ళ చెప్పులు అరిగి పోతున్నాయి. క్వార్టర్ కోసం తిరగడం కంటే ఒక ఆడపిల్లకి పెళ్ళి సంబంధాల కోసం తిరగడం నయం గదా—అనుకున్నాడు. ఈ సంబంధం కాక పోతే ఇంకో సంబంధం కుదురుతుందని ఆశైనా వుంటుంది. దీనికి అదీ

లేదు. రోజు రోజుకూ ఎండ మావిలా దూరమై పోసాగింది క్వార్టర్.

చివరకి ఒక రోజు అతని అదృష్టం పండింది.

ఆ రోజు నారాయణని చూస్తూనే చిరునవ్వు నవ్వి, "రావోయ్ నారాయణా! నీ కోసం చాలా కష్ట పడ్డాను. కొండమీద 'సి' వైపు క్వార్టర్ ఒకటి ఖాళీ అయ్యింది. అబ్బ! దానికోసం ఎంతమంది పోటీ పడ్డారనుకున్నావ్? ఎన్ని రికమండేషన్లు తెచ్చారో తెలుసా? ఎమ్మెల్లే కూడా స్వయంగా వచ్చాడు ఒక కేసులో. అన్నీ అవతలకి నెట్టి మా ఆఫీసర్‌తో పోట్లాడి ఆఖరికి నీకే ఆర్డర్ వేయించాననుకో" అన్నాడు సత్య మూర్తి.

ఆ మాటలు వినగానే అతని ప్రాణం లేచి వచ్చింది. చీకట్లో వెలిగించిన చిచ్చుబుడ్డిలా అతని మనసులో సంతోష తరంగాలు వువ్వెత్తున లేచాయి.

సత్యమూర్తి తన మీద అంత అభిమానం చూపినందుకు కృతజ్ఞతా పూర్వకంగా నవ్వాడు.

తర్వాత అటెండర్ని పిలిచి, "రాజయ్యా! డిస్పాచ్ సెక్షన్‌కి తీసుకెళ్ళి నారాయణకి ఆర్డర్ యిప్పించు" అన్నాడు సత్య మూర్తి.

"రావయ్యా! — నారాయణా!" అంటూ రాజయ్య అతన్ని వరండా లోకి తీసుకెళ్ళాడు.

"జిలేబీ తెచ్చావా?" అన్నాడు రాజయ్య.

"జిలేబీనా....?" నారాయణకి అర్థంగాక తెల్ల మొహం వేశాడు.

"ఆ మాత్రం తెలియదా? జిలేబీ అంటే మా మామూలు" అన్నాడు రాజయ్య నవ్వుతూ.

"ఓ—అదా!" అని అయిదు కాగితం తీసి రాజయ్య చేతిలో పెట్టాడు.

రాజయ్య దాన్ని అర్జంటుగా జేబులో కుక్కుకుని, "మరి గుమాస్తా గారి మామూలు యాభై ఇవ్వ" అన్నాడు.

నారాయణ అదిరి పడ్డాడు. "యాభై ఇవ్వాలా?" అన్నాడు వెల వెల పోతూ.

"అవును. అది మామూలే."

"సత్యమూర్తిగారు నాకు బాగా తెలుసు..." అన్నాడు నారాయణ.

"ఆ బాబుని తెలియనోడు యీ వూళ్ళో ఎవడుంటాడు? ఆ వూసు లన్నీ ఎందుకు? యాభై ఇస్తేనే ఆర్డరు కాగితం నీ చేతిలో పడు తుంది లేదా గిడుతుంది" అని

ఖండితంగా చెప్పేశాడు రాజయ్య.

"అది కాదయ్యా! నే నిలా అన్నానని చెప్పేరా. నా దగ్గిర డబ్బు తీసుకోడు."

రాజయ్య అతన్ని ఎగా దిగా చూసి, "అదంతా నా కనవసరం. నీ కవసరం అయితే ఎళ్ళి ఆ బాబునే అడుగు. నన్ను పిల్చి చెప్తే సరి. లేకపోతే నా పీకట్టుకుంటాడు."

నారాయణ నెమ్మదిగా వెళ్ళి రాజయ్య యాభై అడుగుతున్న సంగతి సత్యమూర్తితో చెప్పాడు.

"శుభమా అని క్వార్టర్ యిస్తుంటే యాభై ఇవ్వలేవా! వాచ్ మాన్‌వి గదా! రెండు సిమెంట్ సంచులు అమ్మితే సరిపోయె. గవర్నమెంటుద్యోగం అంటే ఎవ రికి దొరికింది వాళ్ళకే గదా! నీకు సిమెంటు దొరుకుద్ది. ఆఫీసులో వాళ్ళకి మాకేం దొరుకుద్ది? మీరి య్యాల-మేం పుచ్చుకోవాల. అంతే గదా! అయినా సర్వీస్‌లో ఒక్క-సారే గదా క్వార్టర్ కోసం వచ్చేది. ఎల్లకాలం వస్తావా? వెళ్ళు....ఇటు వంటి విషయాల్లో మొహమాటం పనికి రాదు. అదుంటే నెగ్గలేం మరి" అన్నాడు సత్యమూర్తి బాబు.

నారాయణ తల తిరిగి పోయింది. అతను చెప్పిన మాట లన్నీ తలకెక్క-లేదుగాని, డబ్బివ్వ కుండా ఆర్డర్ యివ్వరని మాత్రం అర్థమైంది. అతని మనసు బాధతో మూలిగింది.

'తన పాలిట దేవుడివని' పొగి డిన సత్యమూర్తేనా?

చావబోతున్న వాడిమీద జాలి పడి రక్షించినందుకు ఇదేనా ప్రతి ఫలం?

డబ్బుముందు ఎవరైనా పరాయి వాళ్ళేనా?'

నారాయణ గుండె భారమై పోయింది. బాధతో చాలాసేపటి వరకూ మాట్లాడలేకపోయాడు.

తర్వాత నెమ్మదిగా గొంతు పెగల్చుకుని, "సరే అయితే! ఇప్పుడు డబ్బులేదు. జీతం వచ్చాక యిస్తాను" అన్నాడు.

లంచం తీసుకోకుండా పని చెయ్యడం-గోడకు సున్నం కొట్ట డం లాంటిదేనని రాజయ్యకి బాగా తెలుసు. అందుకే ఒప్పుకోలేదు.

"నీకు క్వార్టర్ యిచ్చాక ఇక మా ముఖం చూస్తావా? గుమాస్తా గారు ఒప్పుకోరు." ముప్పై మైళ్ళ ముందాలోచన వున్నవాడిలా చెప్పే శాడు

'నీలాంటోళ్ళని నా సర్వీసులో తల్లో వెంట్రుకలంత మందిని మాశాను సుమా!' అన్నట్లు విర్ల

క్ష్యంగా నవ్వాడు నారాయణను చూసి రాజయ్య.

రాజయ్యకి పొట్టకోస్తే అక్షరం ముక్క వచ్చినట్లు లేను గాని, మెదడులో మాత్రం దారుణమైన తెలివితేట లున్నట్లు తోచింది నారాయణకి.

చేసేదేం లేక తిరుగుముఖం పట్టాడు. ఆ మర్నాడే యాభై వాళ్ళ ముఖాన కొట్టి ఆర్డర్ తెచ్చుకోవాలని అనుకున్నాడే గాని తెచ్చుకో లేదు. అనుకున్నవన్నీ జరగనట్లే అదీ జరగ లేదు. నారాయణకి యాభై రూపాయలు అప్పు దొరకలేదు. నెలలో సగం గడిచిపోయాక ఎవరి దగ్గిర డబ్బుంటుంది? తెలిసిన వాళ్ళ దగ్గిర అప్పు దొరకలేదు. చేసేదేముంది? జీతం వచ్చేవరకూ ఆగాడు. జీతం పుచ్చుకున్న మర్నాడే సత్యమూర్తి బాబు దర్శనం చేసుకున్నాడు ఎంతో ఉత్సాహంగా.

నారాయణని చూస్తూనే ఎంతో ఆప్యాయతను ఒలకబోస్తూ మెల్లగా చీవాట్లు వేశాడు సత్యమూర్తి బాబు.

"ఏమయ్యా! నీకు మతిలేనట్లుందే. ఆర్డర్ వేసిన వారం రోజుల్లోపల క్వార్టర్ తీసుకోక పోతే ఆర్డర్ క్యాన్సిల్ చేస్తారని తెలియదా? ఆ మాత్రం తెలియని వాడివి ఎట్లా బ్రతుకుతావో ఏమో! భలేవాడివిలే. ఏ రోజు ఏం ముంచుకొస్తుందో తెలియదు గదా! పెద్దాఫీసరుగారి వంటమనిషికి ఆర్డర్ వెయ్యాల్సి వచ్చింది. చాలా వొత్తిడి చేశారు. ఏం చేస్తాం చెప్పు? నా చేతిలో ఏం లేదని నీకు తెలుసుగదా! ఇందులో నా తప్పేంలేదు. తప్పంతా నీదే. ఈసారి ఎక్కడైనా ఖాళీ అయితే తప్పకుండా వేయిస్తాను. ఇటువంటి పొరపాటు మాత్రం మళ్ళీ చెయ్యకు. అప్పుడప్పుడు వస్తూ వుండు. ఏం?...." అంటున్న సత్యమూర్తి మాటలు కొరడా దెబ్బల్లా మనసుని తాకుతూవుంటే నారాయణ నవనాడులూ క్రుంగిపోయాయి. ఏం మాట్లాడలేక బిక్కమొహం వేసుకొని నీరసంగా వెను తిరిగాడు.

అంతేగాని నారాయణకి ఎలాట్ చేసిన క్వార్టరు ఎన్నాళ్ళున్నా అతను తీసుకోవడానికి రావడం లేదని సత్యమూర్తి ఆఫీసర్‌కి అబద్ధాలు చెప్పి, ఆర్డర్ క్యాన్సిల్ చేయించి, వేరేవాడి దగ్గిర వంద రూపాయలు లంచం తీసుకుని ఆర్డర్ వేసిన సంగతి ఎవ్వరికీ తెలియదు. ✱